AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు



**అక్షరటుడే, ఇందూరు:** వినాయక చవితిని పురస్కరించుకొని గ్రామాల నుంచి వచ్చి పూజా సామాగ్రి విక్రయించే వారిని ఇబ్బంది పెట్టవద్దని దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు పటేల్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మంగళవారం ట్రాఫిక్ ఏసీబీ మస్తాన్ అలీకి వినతి పత్రం అందజేశారు. నగరంలోని వీక్లీ బజార్, గాంధీ చౌక్, పెద్ద బజార్ ప్రాంతాల్లో పూజా సామాగ్రి విక్రయిస్తున్నారన్నారు. వారిని ఇబ్బంది పెట్టకుండా ట్రాఫిక్‌ను డైవర్షన్ చేయాలని కోరారు. స్వామి, రామరాజు, కిషన్, రాహుల్, ప్రతాప్ పాల్గొన్నారు.


27-8-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## మార్కెట్లకు పండుగ శోభ



విఘ్నాలను దూరం చేసే వినాయకుడి నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బుధవారం వినాయక చవితిని పురస్కరించుకొని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. నిజామాబాద్, కామారెడ్డి, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహలను భక్తులు కొనుగోలు చేసి మండపాలకు తరలిస్తున్నారు. కాగా.. కొనుగోలు దారులతో మార్కెట్లు సందడిగా మారాయి. విగ్రహాల కొనుగోళ్లతో పాటు పూలు, పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇక మామిడి, పత్రి, టేకు తదితర 21 రకాల ఆకులతో పాటు కూరగాయలకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది.

—అక్షరటుడే, నిజామాబాద్ సిటీ



## సీపీ ఎదుట 28 మంది బైండోవర్



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో ఉన్న 28 మందిని బైండోవర్ చేశారు. ఈమేరకు అదనపు మేజిస్ట్రేట్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఎదుట మంగళవారం బైండోవర్ నిర్వహించారు. గణేష్ చవితి, మిలాద్‌ఉన్‌నబీ, దుర్గామాత ఉత్సవం సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డీజే ఆపరేటర్లు, డీజే యజమానులు, ట్రబుల్ మాంగర్స్, నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ పరిధిలో వివిధ స్టేషన్లలో ఆయా నేరాలపై కేసులు నమోదైన వారికి ఆర్నెళ్లపాటు సత్ప్రవర్తన నిమిత్తం బైండోవర్ చేశారు. డీజే యజమానులకు రూ.2 లక్షలు, ట్రబుల్ మాంగర్స్‌కు రూ. లక్ష, డీజే ఆపరేటర్లకు రూ.50వేలు సొంత పూచీకత్తుపై సీపీ ఎదుట హాజరుపర్చారు. పూచీకత్తు సమయంలో మళ్లీ నేరాలకు పాల్పడితే జమచేసిన మొత్తం రద్దుతో పాటు శిక్షలు విధిస్తామని పోలీసులు తెలిపారు.

## శోభాయాత్రకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** వినాయక శోభాయాత్ర మార్గంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. బాన్సువాడ పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను మంగళవారం సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి పరిశీలించారు. కల్కి చెరువు పరిసరాలను చూశారు. ఈ సందర్భంగా అధికారులు విద్యుత్ తీగలు, వీధిదీపాలు తదితర అంశాలను సమీక్షించారు. ప్రజలు శాంతియుతంగా నిమజ్జనం ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. భద్రతాపరంగా ఇబ్బందులు కలుగకుండా శోభాయాత్రలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శోభాయాత్రలో పాల్గొనేవారు అధికారులతో సహకరించి పండుగను విజయవంతం చేయాలని కోరారు. వారి వెంట డీఎస్పీ విఠల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, సీఐ అశోక్, మోసాని శ్రీనివాస్ రెడ్డి, దాసరి శ్రీనివాస్, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు ఉన్నారు


## అటవీ పక్షులు విక్రయిస్తున్న మూడు షాపులపై కేసులు



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్రంలోని మాలపల్లిలో అటవీశాఖ అధికారులు మంగళవారం మెరుపు దాడులు చేశారు. అటవీ పక్షులను విక్రయిస్తున్న ముగ్గురు షాపు యజమానులపై ఫారెస్ట్ అధికారులు కేసులు నమోదు చేశారు. మాలపల్లిలోని పలు షాపుల్లో అటవీ పక్షులు విక్రయిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. దీంతో వాటిని సీజ్ చేశారు. అటవీచట్టం ప్రకారం పక్షులను విక్రయించడం నేరమని అటవీశాఖ రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్ తెలిపారు. ఈ దాడుల్లో ఫారెస్ట్ డివిజనల్ అధికారి సుధాకర్ రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

“ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. మండపాల్లో నిబంధనలు పాటించాలని, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఇప్పటికే మండపాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. వినాయక చవితి నేపథ్యంలో పలువురు పోలీసులు అధికారులు ప్రజలకు సూచనలు చేశారు.

# కొలువుదీరనున్న గణనాథుడు



- ముస్తాబైన మండపాలు
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న పోలీసులు

వినాయక చవితిని ఘనంగా జరుపుకోవడానికి ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. బుధవారం మండపాల్లో గణనాథులను ప్రతిష్ఠించనున్నారు. నవరాత్రుల పాట భక్తి శ్రద్ధలతో గణపయ్యకు పూజలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే మండపాలను ముస్తాబు చేశారు. -అక్షరటుడే, ఇందూరు/ కామారెడ్డి


## పకడ్బందీగా ఏర్పాట్లు



నిజామాబాద్ నగరంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. నవరాత్రుల సందర్భంగా నగరంలో ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాం. చిన్న విగ్రహాల నిమజ్జనం కోసం వినాయకుల బావిని సిద్ధం చేశారు. భారీ ప్రతిమలను గోదావరిలో నిమజ్జనానికి తరలించేలా చర్యలు చేపట్టాం. మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి.

– రాజావెంకట్‌రెడ్డి, నిజామాబాద్ ఏసీపీ

## ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు



జిల్లాలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాం. నిర్వాహకులకు ఇప్పటికే జాగ్రత్తలు వివరించాం. ప్రతి గణేశ్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి లింక్ ప్రొవైడ్ చేశాం. ఉత్సవాల సందర్భంగా ప్రజల భద్రత కూడా ముఖ్యమే. దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. రోడ్డుకు అడ్డంగా వినాయకులను ఏర్పాటు చేయకుండా చూస్తున్నాం. హైదరాబాద్ తర్వాత కామారెడ్డిలో ఘనంగా శోభాయాత్ర జరిగే అవకాశం ఉన్నందున భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ఇతర జిల్లాల నుంచి స్పెషల్ పోలీస్ ఫోర్స్ తీసుకువస్తున్నాం.

– చైతన్య రెడ్డి, కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ

## భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి. రాత్రి 10 గంటల తర్వాత మైక్ సౌండ్లు ఆపేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం. ఆర్మూర్ డివిజన్ పరిధిలో గణేశ్ ఉత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. నిమజ్జనోత్సవానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్మూర్ ఏసీపీ

## డీజేలకు అనుమతి లేదు



గణేశ్ ఉత్సవాల సందర్భంగా పోలీసు శాఖ తరఫున అన్ని రకాల ఏర్పాట్లుచేశాం. డివిజన్ పరిధిలోని ప్రజలందరూ శాంతియుత, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి. మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. భారీ శబ్దాలు, డీజేలకు అనుమతి లేదు. ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పండుగ జరుపుకోవాలి.

– విఠల్‌రెడ్డి, బాన్సువాడ డీఎస్పీ

## ప్రశాంతంగా జరుపుకోవాలి



వినాయక చవితిని ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి. బోధన్ డివిజన్‌లో 1,079 వినాయక మండపాలకు అనుమతులు ఇచ్చాం. రాత్రి 10 గంటల వరకు మాత్రమే మైక్ పెట్టుకోవాలి. రోడ్లపై మండపాలు ఏర్పాటు చేస్తే వాహనాలు వెళ్లేలా దారి ఉంచాలి. పోలీసుల నిబంధన ప్రకారం మండపాలను ఏర్పాటు చేసుకోవాలి.

– శ్రీనివాస్, బోధన్ ఏసీపీ



## లడ్డూలు సిద్ధం

వినాయక చవితి సందర్భంగా మండపాలకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి లడ్డూలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే లడ్డూల తయారీ పూర్తి చేయించారు. బుధవారం రాత్రి అన్ని వినాయక మండపాలకు ఈ లడ్డూలను అందజేయనున్నారు.

—అక్షరటుడే, కామారెడ్డి




శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా బంజారా లంబాడీలు తమ ఉపవాసాలను పూర్తి చేశారు. ఈ సందర్భంగా మండలంలోని జెమిని తండాలో లంబాడీలు మంగళవారం స్థానిక జగదంబా సేవాలాల్ ఆలయ ప్రాంగణంలో నృత్యాలు చేశారు. లంబాడాలు శ్రావణం మాసంలో ఐదు మంగళవారాలు వారు నిష్టతో ఉపవాసాలు చేస్తారు. ఐదో మంగళవారం పూర్తవడంతో ఉపవాసాలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్‌కు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. - అక్షరటుడే, గాంధారి

## ఎస్టీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించేలా సహకరించాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** లబానాలను ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ లబాణా సమాజ్ నాయకులు కొన్నేళ్లుగా ఉద్యమం చేస్తున్నారు. ఈ సందర్భంగా గాంధారి మండలానికి చెందిన లాబానా సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్ సింగ్ నాయక్ మంగళవారం మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌ను మంత్రాలయం సచివాలయంలో కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన ఎస్టీ రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎస్టీ రిజర్వేషన్ అమలు చేసేలా ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.






## గణేష్ మండపాలకు ఎమ్మెల్యే ధన్‌పాల్ సహకారం

**అక్షరటుడే, ఇందూరు :** ధన్‌పాల్ లక్ష్మీబాయి, విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ప్రతి ఏడాది గణేష్ మండళ్లకు చందాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ.. హిందువుల్లో ఐకమత్యాన్ని పెంపొందించేందుకు గత పదేళ్లుగా గణేష్ మండళ్లకు చందాలు అందజేస్తున్నానన్నారు. బాలగంగాధర్ తిలక్, ఛత్రపతి శివాజీ మహరాజ్‌లను స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నానని స్పష్టం చేశారు. సెక్యులర్ ముసుగులో హిందువుల ఐక్యతను విడగొట్టే కుట్రలు జరుగుతున్నాయని, అందులో భాగంగానే మార్వాడీ గో బ్యాక్ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారన్నారు. ఇప్పటిదాకా 700 మండపాలకు సహకారం అందించినట్లు చెప్పారు. గణపతి నవరాత్రులను యువత భక్తిశ్రద్ధలతో నియమనిష్టలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



## గుంతలను పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలో మట్టిని తవ్వి వదిలేసిన గుంతలను ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ఉదయం పూడ్చారు. కేబుల్ ఆపరేటర్లు నగరంలోని దేవీ రోడ్డు, ఫ్లై ఓవర్ బ్రిడ్జి దగ్గర గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తరచూ ఈ గుంతల కారణంగా ప్రమాదాలు సైతం జరిగాయి. ఇది గమనించిన ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తన సిబ్బందితో గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి కి ఇరువైపులా ప్రజలకు అంతరాయం వాటిల్లకుండా గుంతలను పూడ్చివేశారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎప్పుడు రద్దీగా ఉండే దేవి రోడ్డులో గుంతలు ప్రజలకు ఇబ్బందులు కలగజేస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ పోలీసుల స్వయంగా రంగంలోకి దిగి పనులు చేపట్టారు. హెడ్ కానిస్టేబుల్ కేశవులు, కానిస్టేబుల్ రాజు సాగర్, కిషన్, గోపాల్ సింగ్, దినేష్ గుంతలు పూడ్చివేశారు. ట్రాఫిక్ పోలీసుల పనితీరు పట్ల నగర ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



## కొత్తస్కూల్ భవనం కోసం విద్యార్థుల రాస్తారోకో..

**అక్షరటుడే, కామారెడ్డి:** శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం స్థానంలో కొత్తది నిర్మించాలని కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి నిరసన తెలిపారు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వర్ పల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి గదిలోని పైకప్పు పెచ్చులు సోమవారం ఊడిపడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం నిమిత్తం బయట ఉన్నారు. దీంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ భవనాన్ని తొలగించాలని సూచించారన్నారు. అయితే అధికారులు మాత్రం గ్రామస్థులే పాఠశాలను డిస్మెంటల్ చేయాలని, అయితేనే తాము నూతన భవనానికి ముగ్గు వేస్తామని చెబుతున్నారని వారు పేర్కొన్నారు. తాము ఏమైనా మేస్త్రీ పనిచేసే వాళ్లమా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్ పాఠశాలకు వచ్చిపరిశీలించాలని కోరారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**అక్షరటుడే, భీమ్‌గల్:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని బాల్కొండ మండలాధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్ కోరారు. సోమవారం మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించే విధి విధానాలపై చర్చించారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





నగరంలో వినాయకుడిని శోభాయాత్రగా తీసుకెళ్తూ నృత్యాలు చేస్తున్న కాకతీయ విద్యాసంస్థల విద్యార్థులు

## కొలువుదీరనున్న గణనాథుడు

పర్యావరణహితమైన మట్టిగణనాథులను ప్రతిష్ఠించేందుకు భక్తులు ఉత్సాహం చూపుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పలువురు మట్టి గణపతులను ఉచితంగా అందజేశారు. భారీ వినాయకులను సైతం మట్టితో తయారు చేసి ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది మట్టి గణనాథులను ఎక్కువ సంఖ్యలో తయారు చేసి విక్రయిస్తున్నారు. – అక్షరటుడే, నెట్‌వర్క్




హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో మట్టి గణపతులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



గ్రామాలకు తరలుతున్న గణనాథులు




నగరం నుంచి వినాయకుడి విగ్రహాన్ని తీసుకెళ్తున్న భక్తులు



డిచ్‌పల్లిలో..



నిజాంసాగర్ మండల కేంద్రంలో..



ఆర్మూర్‌లో..



బాన్సువాడలోని బోర్లం పాఠశాలలో..

## రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** యూరియా లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. తక్షణమే సరఫరా చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. యూరియా కొరత ఉండడంతో రైతులు ఆగ్రహంగా ఉన్నారన్నారు. యూరియా సరఫరాపై అధికారులను అడిగితే అక్కడా ఇక్కడా ఉందని చెప్పి దాటవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పంటలు పొట్టదశలో ఉన్నాయని, ఈ సమయంలో యూరియా లేకపోతే రైతులు నష్టపోతారన్నారు. ప్రైవేట్ వ్యాపారులు యూరియా కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే వ్యాపారుల చర్యలు తీసుకోవాలని కోరారు. కిసాన్



సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, జిల్లా కార్యదర్శి శంకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, రమణారెడ్డి, గోపాల్ రెడ్డి, అంజన్న, భైరవ రెడ్డి పాల్గొన్నారు.

## ఆక్స్ ఫర్డ్ పాఠశాలలో మాక్ ఎన్నికలు

**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణ శివారులోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో మంగళవారం మాక్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాయ్స్, గర్ల్స్ కెప్టెన్, స్పోర్ట్స్, కల్చరల్, స్పోకెన్ ఇంగ్లీష్ కెప్టెన్, ఎకో క్యాపిటల్ పదవులకు ఓటింగ్ నిర్వహించారు. పాఠశాల పరిపాలన అధికారి పద్మ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఓటు ప్రాధాన్యత తెలియజేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## డయల్ 100కు ఆకతాయి ఫోన్..

**అక్షరటుడే, భీమ్‌గల్:** డయల్ 100కు ఫోన్‌చేసి న్యూసెన్స్ చేసిన ఓ వ్యక్తికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తన్నీరు వెంకటేష్ పలుమార్లు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేశాడు. దీంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి ఆర్మూర్ న్యాయస్థానంలో హాజరుపర్చారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ కేసును విచారించి.. వెంకటేష్‌కు మూడురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. డయల్ 100 అత్యవసర సర్వీస్ అని.. ఆపదలో ఉన్న వారికి ఉపయోగపడే ఈ సదుపాయాన్ని దుర్వినియోగం చేయవద్దన్నారు.

## కిసాన్ నగర్‌లో కంటి వైద్య శిబిరం



**అక్షరటుడే, భీమ్‌గల్:** బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో మంగళవారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యుడు పుణ్యరాజు దాదాపు 20 మందికి పరీక్షలు నిర్వహించారు. మోతిబిందు ఉన్న వారిని శస్త్ర చికిత్స నిమిత్తం ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఎస్సై శైలేందర్, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకు లింగం, కార్యదర్శి జ్ఞానసాగర్ రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, కోశాధికారి వంశీరెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**అక్షరటుడే, డొంగ్లి :** తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మద్నూర్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. 250 గజాల ఇంటిస్థలం, రూ.10 లక్షల ఆర్థిక సహాయం హామీలను అమలు చేయాలని కోరుతూ రాహుల్ గాంధీకి పోస్ట్ కార్డులు పంపారు. ఫోరం మండల అధ్యక్షుడు హన్మాండ్లు మాట్లాడుతూ.. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు మాలి శివరాం, పాకల్‌వార్ విఠల్, పైడకులవార్ అంజయ్య, వట్నల్‌వార్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.




**ఎస్సారెస్పీ నుంచి కాలనీకి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో నీరంతా వృథాగా పోతోంది. ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో వేసిన పైపులైన్ కావడంతో శిథిలావస్థకు చేరి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. లీకేజీ నీరు రోడ్డుపై చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయని, తద్వారా రోగాల బారిన పడతామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపిల్లలు, వాహనదారులు గుంతలో పడే ప్రమాదముందని, అధికారులు స్పందించి వెంటనే లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని, గుంతలు పూడ్చివేయాలని కోరుతున్నారు.** - అక్షరటుడే, బాల్కొండ

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా, ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు లభించడంతో తిరిగి అప్పగించాడు. నగరంలోని సాయిరెడ్డి పెట్రోల్ బంకు వద్ద కానిస్టేబుల్ శేఖర్ బాబు విధులు నిర్వహిస్తున్నాడు. పెట్రోల్ బంక్ వద్ద ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్ మర్చిపోయాడు. గమనించిన కానిస్టేబుల్ శేఖర్‌బాబు ఆ ఫోన్ బోధన్‌కు చెందిన అబ్దుల్ గఫార్‌దిగా గుర్తించాడు. ఆయనకు సమాచారం అందించి ఫోన్‌ను అప్పగించాడు. దీంతో కానిస్టేబుల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపాడు.



## ఆర్టీసీ ప్రయాణికులకు అవగాహన సదస్సు

**అక్షరటుడే, ఆర్మూర్ :** బాల్కొండ మండలం కిసాన్ నగర్‌లో ఆర్మూర్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ప్రయాణికుల సమస్యలను తెలుసుకున్నారు. డిపో మేనేజర్ రవి కుమార్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రవేశపెట్టిన మహాలక్ష్మి స్కీం, టూర్ ప్యాకేజీలు, వికలాంగుల బస్‌పాస్‌లపై అవగాహన కల్పించారు. సేఫ్టీ వార్డెన్ ఎన్‌వీవీ రెడ్డి, సీనియర్ సిటిజన్ సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక



**అక్షరటుడే, ఆర్మూర్ :** జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్వేత తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 5న జరిగిన పోటీల్లో సౌమ్యా రాణి, శృతి, అనూష, శరణ్య, సాయికుమార్ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రలో ఈ నెల 28 నుంచి 31 వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు క్రీడాకారులను మంగళవారం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, వినోద్, ప్రభాకర్ రెడ్డి, గంగామోహన్, నరేష్, మౌనిక, పీఈటీలు జ్యోష్ణ, నర్మద తదితరులు అభినందించారు.